
సాక్షి ఒడిశా

మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 3,06,165
వెండి : 13 గ్రాముల 700 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



ఉత్కళ క్యాంపస్‌లో..

ఉత్కళ క్యాంపస్‌లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇతరులను వెళ్లగొట్టారు.

- 8లో



ఆదివాసీలను ఆదుకోవాలి

ఆదివాసీలు నినాదమిచ్చారు. తమను ఆదుకోవాలని కోరారు.

- 8లో

న్యూస్‌రీల్

పీసీసీ సోషల్ మీడియా కమిటీ సభ్యుడిగా అస్లామ్ ఖాన్



అస్లామ్ ఖాన్

రాయగడ: రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా కమిటీ సభ్యులుగా అస్లామ్ ఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ కమిటీ రాష్ట్ర శాఖ చైర్మన్, గుణుపూర్ ఎంఎల్ఏ సత్యజీత్ గొమాంగో కమిటీ సభ్యుల వివరాలను పత్రికలకు సోమవారం విడుదల చేశారు. యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న ఖాన్‌కు సోషల్ మీడియా కమిటీ సభ్యులుగా నియమించడంపై ఆయన అభిమానులు, మద్దతుదారులు అభినందించారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఖాన్ వెల్లడించారు.

నాటుసారా కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

జయపురం: నాటుసారా కలిగి ఉన్నవ్యక్తిని జయపురం అబ్కారీ సిబ్బంది అరెస్టు చేశారు. అరెస్టయిన వ్యక్తి జయపురం సమితి నీలాగుడ గ్రామానికి చెందిన హరిజన్ అని ఎక్సైజ్ అధికారి శశికాంత దత్త సోమవారం వెల్లడించారు. నిందితుడి నుంచి నాటుసారా తో పాటు స్కూటీని స్వాధీనం చేసుకున్నామన్నారు. తనతో పాటు సిబ్బంది ఆదివారం రాత్రి పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో సొరాగుడ మార్గంలో ఓ వ్యక్తి స్కూటీపై వేగంగా రావడంతో అనుమానించి అతన్ని తనిఖీ చేయగా నాటుసారా బయటపడిందన్నారు. హరిజన్‌పై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరు పరిచినట్టు పేర్కొన్నారు.

బలిజాత్రకు ఇసుక సేకరణ



చికిటి నాళాలో ఇసుక తీసి పూజలు చేస్తున్న పూజారి

జయపురం: ఆదివాసీ ప్రజలు జరుపుకునే ముఖ్యమైన వ్యవసాయ సంబంధిత పండగ బలిజాత్ర. బలిజాత్ర కోసం బొయిపరిగుడ సమీప చికిటి నాళా (చికిటి నది)లో ఇసుక సేకరించారు. బొయిపరిగుడ సమీప ప్రసిద్ధ బీరఖంభ మందిర పూజారి బలిజాత్ర పూజా కమిటీ సభ్యులు ఇసుక సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. చికిటినాళ నుంచి సేకరించిన ఇసుకకు పూజ చేసి తమ గ్రామంలో గల గ్రామ దేవత మందిరంలో బుట్టలో వేసి పూజలు చే స్తామని అనంతరం బుట్లలో ఉన్న ఇసుకను గ్రామస్తులకు పంచుతామని వారు బుట్టలలో గల ఇసుకలో వివిధ రకాల విత్తనాలు చల్లి దేవ త గుడిలో ఉంచుతారని అర్చకులు తెలిపారు. ఈ నెల 12న బలిజాత్ర జరుగుతుందని తెలిపారు.

ఘనంగా హనుమాన్ మందిర వార్షికోత్సవం



పూజలందుకున్న వీరహనుమాన్



హనుమాన్ చాలీసా వినిపిస్తున్న బాబూబాయ్ భజరంగ్ బృందం

జయపురం: జయపురం లింగరాజనగర్‌లో ఆ ప్రాంత ప్రజలచే స్థాపించబడిన శ్రీరుద్రవీర హనుమాన్ మందిర నాలుగో వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో బాబూ బాయ్ భజరంగ్ బృందం పాల్గొని 108 హనుమాన్ చాలీశా భక్తులకు వినిపించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని హనుమాన్ చాలీశా విని తరించారు. ఈ సందర్భంగా నిరుపేద బ్రాహ్మణ పిల్లలకు ఉచితంగా ఉపనయనం జరిగింది. అలాగనే రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ మందిర కమిటీ అధ్యక్షులు చిత్తరంజన్ పండ, కోఆర్డినేటర్ బిజయరాయ్ జెనాదేవ్, ఆలయ ట్రస్టీ విప్రచరణ నాయిక్, రాం ప్రసాద్ పట్నాయక్, శ్యామఘణ మహాపాత్రో, జితేంద్ర పాణిగ్రహి, ప్రమోద్ కుమార్ జైన్, అజిత్ దాస్ పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ప్రతి సమస్యకి పరిష్కారం ఉంది: గవర్నర్

- కొరాపుట్‌లో గవర్నర్ పర్యటన ప్రారంభం



కొరాపుట్‌లో కాఫీ పంట పరిశీలిస్తున్న గవర్నర్ హరిబాబు



గవర్నర్‌కి స్వాగతం పలుకుతున్న కాఫీ బోర్డు అధికారులు

కొరాపుట్: ప్రతి సమస్యకు ఓ పరిష్కారం ఉంటుందని గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పర్యటనలో భాగంగా ఆంధ్రా-ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొఠియాపై మీడియా ప్రశ్నించగా బదులిచ్చారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియాలో పర్యటిస్తారా అని ప్రశ్నించగా తన పర్యటన కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాలలో అనుకున్న విధంగా సాగుతుందన్నారు. అనంతరం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని కాఫీ బోర్డుని సందర్శించారు. అక్కడ కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ కాఫీ బోర్డు ప్రాముఖ్యత వివరించారు. కాఫీ మొక్కలు, గింజలు, వాతావరణం గవర్నర్ పరిశీలించారు. కొరాపుట్‌లో పండిన కాఫీ గింజలతో చేసిన కాఫీని ఆస్వాదించి, రుచి అద్భుతంగా ఉందన్నారు. అనంతరం రైతులతో సంభాషించారు. కొరాపుట్ కాఫీ అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చుకున్న విషయం కాఫీ బోర్డు ఉన్నతాధికారులు గవర్నర్‌కి వివరించారు. అంతకు ముందు భువనేశ్వర్ నుంచి జయపూర్ ఎయిర్ పోర్టుకి చేరుకున్న గవర్నర్‌కు అధికారులు, బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన రోడ్డు మార్గాన కొరాపుట్ పట్టణానికి చేరుకున్నారు. సాయంత్రం భారత అల్యూమినియం కేంద్రం (నాల్కో), హిందుస్థాన్ ఏరో నాటిక్స్ లిమిటెడ్ (హాల్), కోట్స్, సెంట్రల్ యూనివర్సిటీ,



కొరాపుట్ కాఫీ కోసం వివరిస్తున్న సిబ్బంది



గవర్నర్‌తో కలెక్టర్ మహాజన్ పర్యటన

ప్రభుత్వ షహీద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాల తదితర సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాత్రి ప్రసిద్ధ శబరి శ్రీ క్షేత్ర జగన్నాథ మందిరాన్ని దర్శించుకున్నారు.

పర్యటనలో ఎస్పీ రోహిత్ వర్మ, కొట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుధర్ బోత్ర తదితరులు పాల్గొన్నారు. మంగళవారం సునాబెడా, సిమిలి గుడ, పొట్టంగి సమితుల్లో పర్యటించనున్నారు. ఏకలవ్య మోడల్ స్కూల్, ప్రసిద్ధ పర్యాటక కేంద్రం దేవమాలిని సందర్శిస్తారు. 10న మల్కన్‌గిరి జిల్లా, 11న తిరిగి కొరాపుట్ జిల్లాలో ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం జరగనుంది.



వేదిక మీద గవర్నర్‌తో కలెక్టర్, ఎస్పీ,ఎమ్మెల్యేలు

ఉప రాష్ట్రపతి ఎన్నికకు బిజూ జనతా దళ్ దూరం

భువనేశ్వర్: భారత ఉప రాష్ట్రపతి ఎన్నిక పురస్కరించుకుని రాష్ట్రంలో ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ నిర్ణయంపై రాజకీయ శిబిరాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ నెల 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికలో బిజూ జనతా దళ్ నిష్క్రమిస్తున్నట్లు సోమవారం ప్రకటించడంతో ఉత్కంఠకు తెర పడింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సకాలంలో సముచిత నిర్ణయంతో రాజకీయాలకు అతీతంగా అడుగు వేయాలనే దృక్పథంతో బిజూ జనతా దళ్ తరచూ ఉభయ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలతో సమాన దూరం సూత్రం పాటిస్తుందని ప్రకటిస్తుంది. సీనియర్ నాయకులతో సంప్రదింపుల తర్వాత బీజేడీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

ఇంతకు ముందు జరిగిన భారత ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బిజూ జనతా దళ్ ఒక్కోమారు ఒక్కో రీతిలో స్పందించి అవాక్కు చేసింది. లోగడ 3 సార్లు జరిగిన ఎన్నికల్లో 3 విధాల ప్రతిస్పందించింది. 2012 సంవత్సరంలో ఇప్పటి మాదిరిగా ఉప రాష్ట్రపతి ఎన్నికకు దూరం పాటించింది. 2017లో జరిగిన ఎన్నికలో ప్రతిపక్షం అభ్యర్థికి మద్దతు ప్రకటించింది. ఆ తర్వాత 2022 సంవత్సరంలో ఎన్డీఏ మద్దతు అభ్యర్థికి అండగా నిలిచింది. తాజాగా జరుగుతున్న భారత ఉప రాష్ట్రపతి ఎన్నికలో బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ 2012 వైఖరిని ప్రతిధ్వనించారు. అప్పట్లో బీజేడీ ఎన్డీఏకు చెందిన జస్వంత్ సింగ్ లేదా యూపీఏకు చెందిన హమీద్ అన్సారీకి మద్దతు ఇవ్వలేదు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి ఎన్నికకు బీజేడీ దూరమై ఓటింగ్ నిష్క్రమిస్తుంది.

రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన బిజూ జనతా దళ్ (బీజేడీ) ఈ నెల 9న జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనకూడదని సోమవారం నిర్ణయించింది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ఇటీవల జరిగిన అంతర్గత రాజకీయ వ్యవహారాల కమిటీ కీలక సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటింగ్‌కు దూరంగా ఉంటుంది. ఎగువ సభలో బిజూ జనతా దళ్‌కు 7 మంది సభ్యులు (ఎంపీలు) బలం కొనసాగుతుంది. ఈ పరిస్థితుల్లో ఉప రాష్ట్రపతి అభ్యర్థిత్వం ప్రతిపాదన లేదా జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీయే), ఇండి కూటమి అభ్యర్థుల్లో ఒకరికి మద్దతుగా ఓటు వేయడంపై బీజేడీ విముఖత వ్యక్తం చేసి త్వరలో జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికకు దూరం అవుతుంది. ఉప రాష్ట్రపతి ఎన్నికల బరిలో ఎన్డీయే అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ప్రతిపక్ష ఇండి కూటమి అభ్యర్థిగా బి.సుదర్శన్ రెడ్డి పోటీ పడుతున్నారు.

ఎగువ సభలో వక్ఫ్ బిల్లు సందర్భంగా ఓటింగ్ సమయంలో బిజూ జనతా దళ్ వైఖరి రాజకీయ విస్ఫోటనం వంటి కలకలం రేపింది. అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఈసారి ఆచితూచి అడుగు వేసి సమ దూరం వైఖరితో సద్దుమణిగింది. బీజేడీ తాజా నిర్ణయంపై భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర మంత్రి ఒకరు పరోక్షంగా బీజేడీ తమకు మద్దతు ప్రకటించిందని వ్యాఖ్యానించడం విశేషం.

నువాపడా ఎమ్మెల్యే రాజేంద్ర ధొలొకియా కన్నుమూత



రాజేంద్ర ధొలొకియా

భువనేశ్వర్: పశ్చిమ ఒడిశాలో ప్రముఖ రాజకీయ నాయకునిగా వెలుగొందిన రాజేంద్ర ధొలొకియా (68) కన్ను మూశారు. మూత్రపిండాల సంబంధిత అనారోగ్యంతో చెన్నైలోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుది శ్వాస విడిచారు. ఆయన మృతిపై గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, విపక్ష నేత, బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్, ఉప ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

శాసన సభ ముంగిట అంతిమ దర్శనం

చెన్నై ఆస్పత్రిలో తుది శ్వాస విడిచిన రాజేంద్ర ధొలొకియా భౌతిక కాయాన్ని ఆకాశ మార్గంలో తరలించి రాష్ట్ర శాసన సభ ముంగిటకు మంగళవారం చేర్చనున్నారు. ఈ సందర్భంగా తోటి సభ్యులు, నాయకులు, సహచరులు, ఇతర ప్రముఖులు, అధికారులు అంతిమ దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

స్వతంత్ర పోరాటం

రాజేంద్ర ధొలొకియా వరుసగా 4 సార్లు రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు. పశ్చిమ ఒడిశా నువాపడా నియోజక వర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహించారు. బిజూ జనతా దళ్ హయాంలో మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన స్వతంత్ర అభ్యర్థిగా ప్రత్యక్ష రాజకీయ ప్రస్థానం శ్రీకారం చుట్టడం విశేషం. ఇటీవల ముగిసిన 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థిగా పోటీ చేసి 61,822 ఓట్లతో విజయం సాధించి రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు. ఆయన 2004 నుంచి 2009 వరకు స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా కొనసాగారు. తదుపరి బిజూ జనతా దళ్ అభ్యర్థిగా పోటీ చేసి వరుసగా 2 సార్లు జరిగిన ఎన్నికల్లో విజయ దుందుభి మోగించారు.

2009 నుంచి 2014, 2019 నుంచి 2024 వరకు నువాపడా నియోజక వర్గం నుంచి బిజూ జనతా దళ్ సభ్యునిగా కొనసాగారు. ఈ రెండు ఎన్నికల్లోనూ ఆయన బిజూ జనతా దళ్ టికెట్ నుంచి పోటీ చేసి గెలిచారు. 1956 నవంబర్ 20న జన్మించిన రాజేంద్ర ధొలొకియా తన రాజకీయ జీవితాన్ని స్వతంత్ర అభ్యర్థిగా ప్రారంభించారు. 2004 ఎన్నికల్లో తొలి విజయం సాధించి రాష్ట్ర శాసన సభలో మొట్టమొదటి సారి అడుగిడారు. తర్వాత ఆయన బీజేడీలో చేరి 2009, 2019 2024లో మరో మూడు వరుస విజయాలు సాధించి పశ్చిమ ఒడిశా నుంచి కీలక నాయకుడిగా ఎదిగారు.

జయపురంలో ఆపరేషన్ ప్రహార్



గుట్కా మాదక ద్రవ్య వస్తువులు అమ్ముతున్న దుకాణం తనిఖీ చేస్తున్న పోలీసులు



చిన్న దుకాణాల్లోనూ తనిఖీలు

జయపురం: గుట్కా, గంజాయి, టొబాకో తదితర మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు జిల్లా పోలీసు అధికారులు చేపట్టిన ఆపరేషన్ ప్రహార్ జయపురంలో జోరుగా సాగుతోంది. ముఖ్యంగా పాఠశాలలు, దేవాలయాలు, ధర్మ సంస్థల పరిసరాల్లో గుట్కా, టొబాకో తదితర వస్తువులు విక్రయించే దుకాణాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. భవిష్యత్‌లో గుట్కా, పొగాకుతో తయారు చేసే వస్తువులు అమ్మితే వ్యాపారులపై ఆపరేషన్ ప్రహార్ ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ పోలీసు అధికారి ఉల్లాస చంద్ర రౌత్ తెలిపారు.

7 అడుగుల కొండ చిలువ పట్టివేత



రాకేశ్ పట్టిన కొండచిలువ

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఎన్ఏసీ 2 వ వార్డులో మేస్త్రీ పనులు చేస్తున్న ఓ వ్యక్తి ఇంటిలో ఏడు అడుగుల కొండ చిలువ దొరికింది. ఎలుక చచ్చిన వాసన రావడంతో కుటుంబ సభ్యులు వెతకగా పాము కనిపించింది. వెంటనే స్నేక్ హెల్ప్‌లైన్ రాజేంద్ర ఖోరకు ఫోన్ చేయగా ఆయన వచ్చి పామును పట్టుకున్నారు.

గుణుపూర్‌లో చోరీ

- రూ. ఒక లక్ష నగదు, మూడు తులాల బంగారం అపహరణ



దొంగలు చిందరవందరగా పడేసిన సామాన్లు



చోరీకి జరిగిన ఇల్లు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ బృందావతి కాలనీలో నివసిస్తున్న ఆకాష్ కుమార్ పొరొచ్చా ఇంట్లో చోరీ జరిగింది. ఆకాష్ కుమార్ ఆరు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. దీన్ని గమనించిన దుండగులు ఇంటి బయట తాళాలను విరగ్గొట్టిన దుండగులు లోనికి చొరబడి అలమరలో ఉంచిన ఒకలక్ష రూపాయల నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలతో పాటు కొంత వెండి ఆభరణాలను దొంగిలించారు. దీనిపై బాధితుడు గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్లో ఆదివారం ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సంఘటన స్థలానికి క్లూస్ బృందంతో చేరుకుని దొంగల ఆచూకీ కోసం సమీపంలోని సీసీ కెమెరాల ఆధారంగా పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

• తప్పని డోలీమోత



డోలీలో రోగిని మోస్తున్న దృశ్యం



రహదారి లేక బురదలోనే నిలిచిపోయిన అంబులెన్స్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి తులసీ పాహడ్ గ్రామంలో ఆదివారం తీవ్ర జ్వరంతో బాధపడుతున్న మంగళదేవి దురువ అనే మహిళలను ఐదు కిలోమీటర్లు డోలీలో మోసుకుంటూ అంబులెన్స్ వద్దకు చేర్చారు. తులసి గ్రామంలో నివాసం ఉంటున్న మంగళదేవికి వారం రోజులుగా జ్వరం వచ్చి తగ్గడం లేదు. దీంతో మత్తిలి ఆరోగ్య కేంద్రానికి ఫోన్ చేసి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అయితే సాలిమి గ్రామం వరకు వచ్చి అంబులెన్స్ ఆ తర్వాత రాకపోవడంతో మహిళను డోలీపై ఐదు కిలోమీటర్లు మోసుకుంటూ తీసుకెళ్లారు.

ద్విచక్ర వాహనం ఢీకొని రైతు దుర్మరణం



బలరాం మృతదేహం



పొలంలో పడిన ద్విచక్ర వాహనం

జయపురం: జయపురం సమితి బి.సింగపూర్ పోలీసు స్టేషన్ పరిధి టింగిరిపుట్ గ్రామంలో మోటార్ సైకిల్ ఢీకొని రైతు దుర్మరణం చెందాడు. మరణించిన రైతు టింగిరిపుట్ గ్రామానికి చెందిన బలరాం నాయిక్ (50)గా గుర్తించారు. ఆదివారం సాయంత్రం బలరాం నాయిక్ గ్రామ సమీపంలోని పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లడు. బాగా పొద్దుపోయిన తరువాత బలరాం ఇంటికి వస్తుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తులు అతన్ని ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో బలరాం తలకు బలమైన గాయమైంది. కదల్లేని స్థితిలో రోడ్డుపై పడ్డాడు. బైక్‌పై వస్తున్న రుకదర నాయిక్, ఉమా పొరజ, గోపాల్‌లు బైక్‌తో పాటు పంట పొలంలో పడిపోయారు. ఆ ప్రమాదాన్ని చూసిన ఆ ప్రాంతంలో ఉన్న వారు సంఘటనా ప్రాంతానికి వచ్చి బలరాం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి బలరాంను కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్ బలరాం అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. ప్రమాదంపై బి.సింగపూర్ పోలీసులకు మృతుని కుటుంబ సభ్యులు లిఖిత ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి సంఘటనా ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు జరిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బైక్‌పై వస్తున్న ముగ్గురు మద్యం తాగి ఉన్నట్టు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన బైక్‌ను సీజ్ చేశారు.

55 మంది మాస్టర్ శిక్షకులకు ప్రశంసా పత్రాలు



ఆదికర్మయోగి శిక్షకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన నోడల్ అధికారి అంశుమాన్ మహాపాత్రో



డైట్‌లో ఆదికర్మయోగి శిక్షకులకు ప్రశంసాపత్రాలు ప్రదానం



రాయగడ సీడీపీఓ బి.కోమలాంగికి ప్రశంసా పత్రం అందజేసిన అధికారులు

పర్లాకిమిడి: స్థానిక జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో జిల్లా స్థాయి ఆదికర్మయోగి శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి శాఖ పీఓ అంశుమన్ మహాపాత్రో అధ్యక్షతన జరగ్గా జిల్లా పరిషత్ అదనపు కార్యనిర్వహణాధికారి పృథ్వీరాజ్ మండల్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సల్మాన్ రైకా తదితరులు పాల్గొన్నారు. వారంరోజులుగా జరిగిన ఆదికర్మయోగి శిక్షణ శిబిరంలో విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, మహిళ, శిశువికాస్, పంచాయితీరాజ్, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి మండలి సభ్యులకు బ్లాక్ స్థాయి మాస్టర్ ట్రైనర్‌లతో శిక్షణ ఇప్పించారు. 2036 కల్లా వికసిత్ ఒడిషా, 2047 కల్లా వికసిత భారత్ అనే నినాదంతో ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్జీఓ సంస్థలు కలసి పనిచేయాలన్న లక్ష్యంతో ముందుకుపోవాలని ఐటీడీఏ పీఓ అంశుమాన్ మహాపాత్రో అన్నారు. మొత్తం జిల్లావ్యాప్తంగా ఏడు సమితి కేంద్రాల నుంచి 55 మంది సమితి మాస్టర్ ట్రైనర్లుగా నియమించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా అనేకమంది మాస్టర్ శిక్షకులకు సర్టిఫికెట్లను నోడల్ అధికారి అంశుమాన్ మహాపాత్రో ప్రదానం చేశారు.

క్లుప్తంగా

ఆలయాల్లో సంప్రోక్షణ పూజలు



కళ్యాణ వేంకటేశ్వర మందిరంలో విగ్రహాలకు అభిషేకిస్తున్న భాస్కరాచార్యులు

రాయగడ: చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో మూసివేసిన మందిరాలు సోమవారం యథావిధిగా తెరుచుకున్నాయి. ముందుగా మందిరాల్లో సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం అభిషేకాలు, పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం భక్తులకు స్వామి వార్ల దర్శన భాగ్యం కల్పించారు. ఇందులో భాగంగా స్థానిక బాలాజీనగర్‌లోని కళ్యాణ వేంకటేశ్వర మందిరంలో ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు విగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

హోరా.. హోరీగా..

- పర్లాకిమిడిలో జోనల్ స్థాయి క్రీడా పోటీలు



పరుగు పందెంలో పోటీ పడుతున్న విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక శ్రీకృష్ణచంద్రగజపతి కళాశాల గ్రౌండ్‌లో సోమవారం జోనల్ స్థాయిలో వివిధ ఉన్నత విద్యాలయాల క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీలకు 12 విద్యాలయాలు, కళాశాలల నుంచి అండర్ 14, అండర్ 17 బాలబాలికలు పోటీపడ్డారు. వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్, వివిధ పోటీలకు సుమారు 180 మంది పోటీ పడ్డారు. ఈ క్రీడాంశాలను జిల్లా ముఖ్యశిక్షాధికారి డాక్టర్ మాయాధర్ సాహు ఆదేశాల మేరకు నిర్వహించారు. మహారాజా బాలుర ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు డి.శ్రీరామ్మూర్తి క్రీడా పతాకం ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. జిల్లా ఇన్‌చార్జి క్రీడా అధికారి సురేంద్ర నాథ్‌పాత్రో క్రీడాకారులతో శపథం చేయించారు. ఈ పోటీలను ఉపాధ్యాయుడు జగన్నాథ పట్నాయక్, క్రీడా శిక్షకులు ధీరేంద్ర కుమార్ సామల్, ఢీల్లేశ్వర్ తృణ, రాజకిశోర్ పాత్రో, సుదీప్త బారిక్ తదితరులు పర్యవేక్షించారు.

నలుగురు వ్యక్తులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

ఆమదాలవలస: మండలంలోని చిట్టివలస గ్రామానికి చెందిన నవిరి పూర్ణ (22) అనే వివాహిత ఆత్మహత్య కేసులో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. చిట్టివలస గ్రామానికి చెందిన నవిరి సింహాచలం, పద్మ దంపతుల కుమార్తె పూర్ణకు పట్టణంలోని ఐజే నాయుడు కాలనీకి చెందిన సాయిపల్లి మధుసూదనరావుతో ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహమైంది. అయితే పూర్ణను అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధించడంతో కన్నవారింటికి చేరుకుంది. అనంతరం మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో ఆత్మహత్యకు కారణమైన భర్త మధుసూదనరావు, మామ లక్ష్మణ, అత్త సరస్వతీ, మరిది ఈశ్వరరావులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందన్నారు. నలుగురి ముద్దాయిలను స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌ఐ ఎస్.బాలరాజు పాల్గొన్నారు.

గంజాయితో నలుగురు అరెస్టు



మాట్లాడుతున్న సీఐ సూర్యనారాయణ

పలాస: ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి నెల్లూరుకు అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా పలాస రైల్వేస్టేషన్‌లో ఆదివారం నలుగురు వ్యక్తులను కాశీబుగ్గ పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. వారి నుంచి 6.115 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో సోమవారం తెలియజేశారు. దీంతో నెల్లూరు జిల్లా బుజబుజ గ్రామానికి చెందిన సయ్యద్ సుల్తాన్, బి.అరుణకుమార్, ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి గ్రామానికి చెందిన సాయిక్ జాఫర్, తమిళనాడు రాష్ట్రం అనిస్‌నగర్‌కు చెందిన విచిత్రదేవిలపై కేసు నమోదు చేశామన్నారు. వీరిలో ముగ్గురిని అరెస్టు చేసి, పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచామన్నారు. వీరి నుంచి గంజాయితో పాటు ఒక సెల్‌ఫోను, రూ.1,020ల నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.



ఉత్కళ విశ్వ విద్యాలయం క్యాంపస్ ప్రాంగణంలో పోలీసు బలగాల మోహరింపు



ఉత్కళ హాస్టల్ గదుల్లో పోలీసుల సోదాలు



మూటాముల్లె సర్దుకుంటున్న చొరబాటుదారులు



చొరబాటుదారుల సరంజామా

ఉత్కళ క్యాంపస్‌లో ఉద్రిక్తత

- హాస్టల్ నుంచి చొరబాటుదారుల తొలగింపు
- పోలీసు దళాల మోహరింపు

భువనేశ్వర్: స్థానిక ఉత్కళ విశ్వ విద్యాలయం హాస్టల్ గదుల్లో విద్యార్థేతరుల చొరబాటు తీవ్ర కలకలం రేపింది. చొరబాటుదారుల్ని తొలగించేందుకు భారీగా పోలీసు బలగాల్ని మోహరించారు. సోమవారం నుంచి పెద్ద సంఖ్యలో చొరబాటుదారులను తొలగించారు. వారికి సంబంధించిన సామగ్రిని తొలగించి హాస్టల్ గదులు ఖాళీ చేయించారు. క్యాంపస్‌లో శాంతిభద్రతల పరిస్థితికి ఏ మాత్రం భంగం కలగకుండా తొలగింపు చర్యని విజయవంతంగా నిర్వహించారు. ప్రధానంగా గోపబంధు హాస్టల్ సముదాయంలో పురుషుల విభాగం చొరబాటుదారుల వేధింపులతో తల్లడిల్లింది. అర్ధరాత్రి అల్లర్లు, అనేకసార్లు శాంతిభద్రతల సమస్యలు రేకెత్తాయి. పోలీసుల దాడిలో స్థానిక వాణీ విహార్ ఉత్కళ్ విశ్వవిద్యాలయంలోని జెంట్స్ హాస్టల్ నంబర్ 1, 2, 3, 5 నంబర్ల గదుల్లో దీర్ఘ కాలంగా తిష్ట వేసిన విద్యార్థేతర వర్గాల్ని తరలించే ప్రక్రియ చురుగ్గా కొనసాగుతుంది. విశ్వవిద్యాలయ సీనియర్ అధికారుల సమక్షంలో పోలీసులు విద్యార్థేతర వర్గాల్ని గుర్తించి తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల వరకు పీజీ కౌన్సిల్ విశ్వవిద్యాలయంలోని అన్ని తరగతులను రద్దు చేసింది.

క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా 3 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించారు. ఐదుగురు ఏసీపీ, 4 మంది ఇన్‌స్పెక్టరు ఇన్‌చార్జిలు, 13 మంది సబ్ ఇన్‌స్పెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో తొలగింపు చర్యలు ముమ్మరంగా కొనసాగించారు. దాడుల్లో మద్యం సీసాలు వంటి అభ్యంతరకర సామగ్రి బయటపడింది. దాడుల్లో డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు వంటి విద్యార్థేతర వర్గాలు హాస్టలు గదులు ఆక్రమించి స్థిర నివాసాలుగా మలచుకున్నట్లు గుర్తించారు. వారిలో చాలామందికి రాజకీయ సంస్థలతో సంబంధం ఉన్న వర్గాలతో క్యాంపస్‌లో భద్రతా పరిస్థితి మరింత క్లిష్టతరం అయిందని ఆరోపణ.

నిర్ణయాత్మక రాజకీయ శక్తిగా బీజేడీ

భువనేశ్వర్: ప్రాంతీయ పార్టీగా ఆవిర్భవించిన బిజూ జనతా దళ్ జాతీయ స్థాయి రాజకీయాల్లో నిర్ణయాత్మక శక్తిగా వెలుగొందుతుంది. పలు జాతీయ సంక్లిష్ట పరిస్థితుల్లో భిన్నమైన వ్యూహాలతో తనదైన ఉనికిని చాటుకుంది. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ఫలితాల ఆధారంగా రాష్ట్రంలో తొలి సారిగా విపక్ష హోదాతో సరికొత్త పోకడని చాటుకుంటుంది. ఉప రాష్ట్రపతి ఎన్నిక సందర్భంగా ప్రదర్శించిన వ్యూహాత్మక నిర్ణయం చర్చనీయాంశమైంది.

విభిన్న శైలితో సమాన దూరం..

రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేడీ ఎన్డీయే, ఇండి కూటమి నుంచి సమాన దూరం వ్యూహాన్ని విభిన్నంగా ప్రదర్శించింది. బిజూ జనతా దళ్ 2012లో తొలి సారిగా అనుసరించిన మునుపటి సమదూర విధానం 2022 రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలలో విభిన్నంగా ప్రదర్శించింది. 2012లో రాష్ట్రపతి పోటీ కోసం పి.ఎ.సంగ్మా పేరును నవీన్ పట్నాయక్ ప్రకటించి బీజేడీ తరఫున మద్దతు అందించారు. అదే సంవత్సరం జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటింగ్‌కు దూరమై ఎన్డీఏకు చెందిన జస్వంత్ సింగ్, యూపీఏకు చెందిన హమీద్ అన్సారీలో ఏ ఒక్కరికి మద్దతు ప్రకటించ లేదు. 2017లో ఎన్డీఏకు చెందిన రామ్ నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా, యూపీఏకు చెందిన గోపాలకృష్ణ గాంధీని ఉప రాష్ట్రపతిగా మద్దతు ఇవ్వడం ద్వారా బీజేడీ తన వైఖరిని జాగ్రత్తగా సమతుల్యం చేసుకుంది. తద్వారా రెండు జాతీయ కూటమిల నుంచి సమాన దూరాన్ని వ్యూహాత్మకంగా ప్రదర్శించి ఔరా అనిపించింది. ఆ తర్వాత 2022లో, ఎన్డీఏ అభ్యర్థులైన రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతిగా జగదీప్ ధన్‌ఖడ్‌లకు మద్దతు ఇచ్చి విశ్లేషకుల అంచనాలను తలకిందులు చేసింది. బీజేడీ వైఖరి స్పష్టమైన మార్పుతో ఊహాతీతంగా స్పందించింది. దీంతో బీజేపీ, బీజేడీ లోపాయికారీ మిత్ర కూటమి అనే వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చెలరేగాయి. అయితే ఈ వైఖరి తదుపరి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైపరీత్యాన్ని ప్రేరేపిస్తాయని కొన్ని వర్గాలు చేసిన వ్యాఖ్యలు 2024 సార్వత్రిక ఎన్నికలలో పార్టీ ఎదుర్కొన్న ఊహాతీత పరిణామాలు రుజువు చేశాయి. వక్ఫ్ బిల్లును ఆమోదించడంతో మరోసారి బీజేడీ శిబిరంలో తీవ్ర మనస్పర్థలు తలెత్తాయి. ఈ పరిస్థితులు పునరావృతం కాకుండా తాజాగా జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఓటింగ్‌కు దూరం కావాలని నిర్ణయించింది. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల తర్వాత ఈ నిర్ణయం తొలి రాజకీయ వ్యూహరచనగా రాజకీయ పటిష్టతని ప్రతిబింబిస్తోంది.



నవీన్ పట్నాయక్



ఆదివాసీలను ఆదుకోవాలి

పర్లాకిమిడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ వ్యతిరేక విధానాలను విడనాడాలని గజపతి జిల్లా మోహనా బ్లాక్ భగమర్రి పంచాయతీ శికులిపదర్ గ్రామంలో ఆదివాసీ సంఘర్ష మోర్చా (ఏ.ఎస్.ఎం) ఆధ్వర్యంలో సోమవారం సభ నిర్వహించారు. తొలుత సికులిపదర్ గ్రామం నుంచి మోహనా సంతపేట వరకు ఆదివాసీ సంఘర్ష మోర్చా, సి.పి.ఎం (లిబరేషన్) కార్యకర్తలు, రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి గోమాంగో, నర్సింహ మండల్, కేశబ రైయితో తదితరులు నాయకత్వం వహించి ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో మొక్కజొన్న పంటకు మద్దతుధర, మండీలు ఏర్పాటుచేసి కిలోకి వంద రూపాయలు బోనస్, రైతులకు 50 కిలోల బియ్యం, మన్‌రేగా ఉపాధి పనుల కూలీలకు రూ.600 మంజూరు, పెన్షన్ రూ.5 వేలు, లుహాగుడి పంచాయతీ దంతరినల్లా గ్రామం అంగన్‌వాడీ పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పేరిట అడవులు నాశనం చేస్తున్నారని, ఆదివాసీ భాష, సంస్కృతిని రాజ్యాంగ అధికారం ఇవ్వాలని తిరుపతి గోమాంగో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆదివాసీల కష్టాలను గుర్తించకుండా పెద్ద, పెద్ద కంపెనీలకు అటవీ భూములు కట్టబెడుతున్నాయని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆదివాసీలకు రాజ్యాంగ హక్కు కల్పించకుంటే సమీప భవిష్యత్‌లో ఆందోళన తీవ్రతరం చేస్తామని తిరుపతి గోమాంగో అన్నారు. ఈ ఆందోళనలో మాథ్యూమండళ్, డంగల్ రయితో, తమాస్ రయితో, కేశవ్ రయితో, జోహాన్ రయితో, ఎలియా గోమాంగో, సర్బశ్రీ గోమాంగో తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘర్ష్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి గోమాంగో



ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

సమస్యలకు పరిష్కారం చూపాలి



-పర్లాకిమిడి: ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా బ్లాక్ భుభుని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామముఖీ పరిపాలన, స్పందన కార్యక్రమం నిర్వహించారు. అదనపు జిల్లా మాజిస్ట్రేట్ ఫాల్గుని మఝి, జిల్లా ఎస్పీ జ్యోతింద్రపండా, ముఖ్యకార్య నిర్వాహణ అధికారి, జిల్లా పరిషత్ శంకర్ కెరకెటా, సబ్ కలెక్టర్ అనుప్ పండా తదితరులు హాజరయ్యారు. భుభని పంచాయతీతో సహా సెరంగో, అజయగడ, తుమ్ములో గ్రామాల నుంచి 62 వినతులు అందాయి. వాటిలో వ్యక్తిగతం 18 కాగా, గ్రామ సమస్యలకు సంబంధించినవి 43 ఉన్నాయి. వీటిని సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కారం చూపాలని ఏడీఎం మఝి ఆదేశించారు. గ్రీవెన్స్‌కు గుమ్మా సమితి అధ్యక్షురాలు సునేమీ మండల్, బీడీఓ దులారాం మరాండి, తహసీల్దార్ శరత్ శోబోరో, సీడీఎంఓ డాక్టర్ ఎం.ఎం.అలీ, బ్లాక్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

మాన్యంకొండలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మాన్యంకొండ పంచాయతీలో సోమవారం జిల్లా కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యయ్ గ్రీవెన్స్ నిర్వహించారు ప్రజాల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధింత అధికారులకు ఆదేశించారు. అనంతరం మాన్యంకొండ పంచాయతీలో పర్యటించి గ్రామస్తులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వినోద్ పటేల్, జిల్లా అటవిశాఖ అధికారి సాయికిరణ్, సబ్ కలెక్టర్ అశ్విని, కలిమెల బీడీఓ, సహ జిల్లా ఎన్నికల అధికారి ఆశోక్ చక్రవర్తి, జిల్లా అభివృద్ధిశాఖ అధికారి నరేశ్ శభరో, పలుశాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: మాన్యంకొండ గ్రామస్తులతో చర్చిస్తున్న కలెక్టర్ ఉపాధ్యాయ్

జాతీయ పోటీలకు నడగాం విద్యార్థి



యోగాసనం వేస్తున్న మనోహర్‌నాథ్

నరసన్నపేట: జాతీయ స్థాయి యోగాసన పోటీలకు మండలంలోని నడగాం గ్రామానికి చెందిన బొత్స మనోహర్‌నాథ్ ఎంపికయ్యాడు. డిసెంబర్ 27 నుంచి 30వ తేదీ వరకూ రాంచీలో యోగా స్పోర్ట్స్ చాంపియన్-2025 పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో మనోహర్‌నాథ్ పాల్గొనున్నట్లు తండ్రి కేదారనాథ్ వెల్లడించారు. సెప్టెంబర్ 6, 7వ తేదీల్లో ఏపీ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు తిరుమలలో జరిగాయన్నారు. ఈ పోటీల్లో మనోహర్‌నాథ్ కాంస్య పతకం సాధించినట్లు వెల్లడించారు. ఈ మేరకు జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ తరుపున పాల్గొనున్నట్లు వివరించారు. కాగా తమ గ్రామానికి చెందిన బాలుడు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై గ్రామానికి చెందిన నాయకులు లుకలాపు రవి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

బాణం దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి నాయకగూఢ పంచాయతీ పాకనగూఢ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం గ్రామస్తుల మధ్య వివాదం చోటుచేసుకుంది. లక్ష్మణ్ గూడ్, విశ్వనాథ్ గూడ్ మధ్య మాట మాటా పెరగడంతో బాణాలతో దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో లక్ష్మణ్ గూడ్ పొట్టలోకి బాణం దూసుకుపోయింది. దీంతో కుటుంబీకులు వెంటనే అతన్ని పాండ్రీపాణి ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ వైద్యులు మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు వైద్యులు శస్త్రచికిత్స చేసి బాణాన్ని తొలగించారు. అయితే పరిస్థితి మరింత విషంగా ఉండడంతో అంబులెన్స్‌లో కోరాపూట్ మెడికల్ ఆస్పత్రికి తరలించారు. మల్కన్‌గిరి పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ఐఐసీ రీగాన్‌కీండో కేసు నమోద్ చేసి బాణంతో దాడి చేసిన విశ్వనాథ్ కోసం గాలిస్తున్నారు.



గాయపడిన లక్ష్మణ్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం పరిధిలోని పెదపాడు పరిసర ప్రాంతం మైస్టోర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెండువానిపేట గ్రామానికి చెందిన కింజరాపు గంగరాజు(30) అనే వ్యక్తి ఒక ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధి నిర్వహణకు వెళ్లి ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా, ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న పెదపాడుకు చెందిన ఒక వ్యక్తి ఢీకొన్నాడు. దీంతో గంగరాజు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే స్థానికులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు తండ్రి కింజరాపు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరెస్టుల్లో జాప్యమెందుకూ..?

నరసన్నపేట: పట్టణానికి చెందిన బంగారం వ్యాపారి వెంకట పార్వతీశం గుప్తా హత్య కేసులో అరెస్టులు చేయడంలో జరుగుతున్న జాప్యంపై కుటుంబ సభ్యులు, స్థానిక వర్తక ప్రముఖులు ఆందోళన చెందుతున్నారు. నిందితులుగా అనుమానిస్తున్న వారిని పోలీసులు గుర్తించినా, అరెస్టుల్లో జాప్యం జరుగుతుండడంతో వారిలో కొందరిని కాపాడే ప్రయత్నాలు పోలీసులు చేస్తున్నారా అనే అనుమానాలు కలుగుతున్నాయని అంటున్నారు. కాగా ఈ వ్యవహారంపై ఎటువంటి అనుమానాలు స్థానికులకు అవసరం లేదని, కేసులో సాక్ష్యాలను మరింత పటిష్టంగా చూపించాలనే ప్రయత్నాలు చేస్తుండడం వలనే అరెస్టుల్లో జాప్యం జరుగుతోందని పోలీసులు అంటున్నారు. గుప్తా వద్ద నిందితులు కాజేసిన బంగారం రికవరీ అయినట్లు తెలుస్తోంది.

అలాగే అనుమానితులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని వర్తక సంఘం ప్రతినిధి, ఎంపీటీసీ వైశ్యరాజు కేశవరాజు, గుప్తా సోదరుడు మన్మథరావులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఆమదాలవలస: పట్టణంలోని డాబాలవారి వీధికి చెందిన గూడాడ ఉపేంద్ర (27) తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ సనపల బాలరాజు తెలిపిన వివరాల మేరకు.. మునగవలస గ్రామానికి చెందిన ఉపేంద్ర సరుబుజ్జిలి మండలం పాలవలస గ్రామానికి చెందిన కొంచాడ సునీత అనే వివాహితతో మూడేళ్లుగా పట్టణంలోని డాబాలవారి వీధిలో నివాసం ఉంటున్నాడు. మృతుడు జిల్లా కేంద్రంలోని ఒక జిరాక్స్ షాపులో పనిచేస్తుండగా, వివాహిత మహిళా సునీత పట్టణంలోని కిరాణా దుకాణంలో పనిచేస్తూ సహ జీవనం చేసేవారు. అయితే మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు తల్లి గూడాడ పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.



ఉరికి వేలాడుతున్న ఉపేంద్ర మృతదేహం

సకాలంలో వినతులు పరిష్కరించాలి

- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
- పీజీఆర్ఎస్‌కు 75 వినతులు



రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సకాలంలో అధికారులు పరిష్కరించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా వివిధ శాఖలకు చెందిన 75 వినతులు స్వీకరించారు. వాటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 23 దరఖాస్తులు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థకు 16, మున్సిపల్ శాఖకు 5, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెరో 4 దరఖాస్తులు అందాయి. అదేవిధంగా నీటి వనరులు, సర్వే సెటిల్‌మెంట్స్, వ్యవసాయం, విద్యుత్ పంపిణీ సంస్థలకు చెరో 3 ఫిర్యాదులు నమోదయ్యాయి. ప్రజలు తమ సమస్యలను నేరుగా జేసీ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, డిప్యూటీ కలెక్టర్ (డీఎంపీసీ) టి.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న చింతాడ రవికుమార్

ఇరిగేషన్ లిఫ్టును మరమ్మతులు చేయాలి

బూర్జ మండలంలోని నీలాదేవిపురం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మోటార్లు పాడైపోయి 5 గ్రామ పంచాయతీల పరిధిలోని 800 ఎకరాలకు సాగునీరు అందడం లేదు. ఈ విషయంపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ కోరారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. అలాగే ఆమదాలవలస మండలం పొన్నంపేట గ్రామంలో ఇదివరకే ఒక శ్మశానవాటిక ఉంటుండగా, రాజకీయ కారణాలతో రెండో శ్మశానవాటిక ఏర్పాటు చేయడానికి అధికారుల సన్నాహాలు నిలుపుదల చేయాలన్నారు. పొందూరు మండలంలోని చాలా గ్రామాల్లో రైతులకు ఎరువులు అందలేదని, సత్రమంగా ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఆయనతో పాటు పలువురు రైతులు ఉన్నారు.

వినతులు పరిశీలిస్తే...

ఉచిత బస్సు పథకం వలన ఉపాధి నష్టపోతున్న ఆటో, మ్యాక్సీ, క్యాబ్, డ్రైవర్లకు ప్రభుత్వం సంవత్సరానికి రూ.30,000ల చొప్పున భృతి ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ ఆటో డ్రైవర్లు వినతిపత్రం అందజేశారు. ఫ్రీ బస్సు పథకం వలన తీవ్రంగా నష్టపోతున్నామని, ప్రైవేట్ ఫైనాన్సర్స్ దగ్గర అధిక వడ్డీలకు అప్పులతో ఆటోలను కొనుగోలు చేశామని ఆవేదన వ్యక్తం చేశారు.

- సారవకోట మండలం చిన్నకిట్టాలపాడు గ్రామ పంచాయతీ బొంతుగూడ గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గిరిజనులు కోరారు.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఇమామ్‌లు, మౌజన్‌ల గౌరవ వేతనాలు చెల్లించాలని జిల్లా మైనారిటీ సెల్ కమిటీ ప్రతినిధులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించడం తగదన్నారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి మృతి



లక్ష్మణరావు మృతదేహం

దత్తిరాజేరు: మండలంలోని మరడాం వద్ద జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం లారీ ఢీకొనడంతో మర్రివలస గ్రామానికి చెందిన కోరాడ లక్ష్మణరావు(42)అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్.బూర్జవలస ఏఎస్సై రమణ తెలిపారు. ఈ మేరకు స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..రామభద్రపురం నుంచి గజపతినగరం వెళ్తున్న లారీ బస్సు కోసం ఉన్న లక్ష్మణరావు వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి కొన్నాళ్ల క్రితం భార్యతో తెగతెంపులు అవగా కూలి పనులు చేసుకుంటూ అన్నదమ్ముల వద్ద ఉంటున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చెప్పారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: డిసెంబర్ 7న జరగనున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బి.రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షలు రాయడానికి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎయిడెడ్ పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుని కుటుంబ సంవత్సరాదాయం రూ.:3.5లక్షలు మించకూడదని తెలిపారు. ఈనెల 30వ తేదీలోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు పార్వతీపురంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం పని దినాల్లో సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

జాతీయస్థాయి పోటీలకు రాజాం క్రీడాకారులు



జాతీయస్థాయి పికిల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాజాం సిటీ: ఈ నెల 26 నుంచి 29 వరకు జమ్ము కశ్మీర్‌లో జరగనున్న పికిల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రాజాం క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 6, 7తేదీలలో విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీలు జరగ్గా రాజాంకు చెందిన పీవీజీకే రాజు, డాక్టర్ బీహెచ్ అరుణ్‌కుమార్, డాక్టర్ ఎం.పురుషోత్తం, సీహెచ్ రామకృష్ణంరాజు, బి.శాంతిస్వరూప్, ఆర్.విజయకృష్ణలు చక్కని ప్రతిభకనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ఎంపిక జాబితా వచ్చిందని క్రీడాకారులు తెలిపారు. వారి ఎంపికపట్ల రాజాంకు చెందిన పలువురు అభినందనలు తెలియజేశారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మణరావు మృతదేహం

సంతకవిటి: మండలంలోని తాలాడ గ్రామానికి చెందిన బింగి లక్ష్మణరావు సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అప్పుల బాధ తాళలేక లక్ష్మణరావు తన కళ్లలంలోని రేకుల షెడ్‌లో ఉరి వేసుకున్నట్లు భార్య గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసు శాఖకు జాగిలాల కేటాయింపు

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



జిల్లాకు చేరుకున్న జాగిలాలు జూలీ, చార్లీలతో హేండర్లు

పార్వతీపురం రూరల్: పోలీసుశాఖలో కీలకంగా వ్యవహరించి పేలుడు పదార్థాల కేసుల ఛేదింపు, నేరస్తులను గుర్తించడంలో ఉపయోగపడే జాగిలాలను జిల్లా పోలీసు శాఖకు రెండింటిని కేటాయించారు. ఈ మేరకు సోమవారం నూతన జాగిలాలు జూలీ, చార్లీతో పాటు హేండర్స్ ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ రెండు జాగిలాలు విజయవాడ మంగళగిరి హెడ్‌క్వార్టర్స్ 6వ బెటాలియన్ లో సీటీసీలో శిక్షణ పొందినట్లు ఎస్పీ తెలిపారు. ఈ మేరకు ఎస్పీ వాటి హేండర్‌లైన పార్వతీశం, లక్ష్మణరావు, ఆనంద్‌మోహన్‌లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ థామస్ రెడ్డి, ఆర్‌ఐలు రాంబాబు, నాయుడు, డాగ్ హేండర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆటల పండగకు వేళాయె..!

- ఎస్‌జీఎఫ్ పోటీలకు ఖరారైన షెడ్యూల్
- 10 నుంచి ప్రారంభం కానున్న జిల్లా స్థాయి పోటీలు
- షెడ్యూల్ విడుదల చేసిన జిల్లా విద్యాశాఖ



ఆటల్లో తలపడుతున్న విద్యార్థులు (ఫైల్)

విజయనగరం: విద్యార్థి దశ నుంచే బాలబాలికలు క్రీడలపై దృష్టి సారించేందుకు ప్రతి ఏడాది ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాదికి సంబంధించి ఇదే నెలలో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు షెడ్యూల్‌ను జిల్లా విద్యాశాఖ సోమవారం ప్రకటించింది. క్రీడా నైపుణ్యాలను పెంపొందించడం, ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక చేయడం ఈ క్రీడల ముఖ్య ఉద్దేశం. ఈనెల 10 నుంచి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ వెల్లడించింది.

మూడంచెల పద్ధతిలో ఇలా..

స్కూల్‌గేమ్స్ పోటీల్లో భాగంగా మొత్తం 50 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. అండ్-14, 17 విభాగంలో పాఠశాల, అండర్-19 విభాగంలో ఇంటర్ విద్యార్థులకు మండల, జోనల్, జిల్లా స్థాయిల్లో విడతల వారీగా నిర్వహిస్తారు. 50 క్రీడాంశాలకు గాను ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ క్రీడాంశాలకు మూడంచెలుగా పోటీలు నిర్వహించనున్నారు. మిగిలిన 43 క్రీడాంశాలకు సంబంధించి జిల్లా స్థాయిలో నేరుగా పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. మూడంచెల్లో నిర్వహించే 7 క్రీడాంశాల్లో ముందుగా అన్ని మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి జోనల్ స్థాయి పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఆహ్వానిస్తారు. అక్కడి నుంచి ఉమ్మడి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి పంపిస్తారు. కాగా ఉమ్మడి జిల్లాల వారీగా ఒక్కో క్రీడాంశంలో ఒక జట్టును ఎంపిక చేస్తారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై క్రీడల్లో, పాల్గొన్న వారికి ధ్రువీకరణపత్రాలు అందిస్తారు. వాటితో వివిధ ఉద్యోగాలకు క్రీడా కోటా కింద 2శాతం రిజర్వేషన్ల సదుపాయం ఉంటుందని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

నిర్వహణ సాధ్యమేనా..?

ప్రతి ఏడాది నిర్వహించే స్కూల్ గేమ్స్ పోటీలకు సంబంధించి కూటమి ప్రభుత్వం స్పష్టమైన విధి విధానాలను ప్రకటించకుండా పోటీల నిర్వహణకు సిద్ధమవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నారు. పోటీల నిర్వహణకు ప్రభుత్వపరంగా కొంతమేరకే సహకారం అందనున్నప్పటికీ ఎప్పటిలాగానే దాతల సహకారం తీసుకోవాల్సిన పరిస్థితి కీలకంగా మారింది. అంతేకాకుండా ఇప్పటి వరకు పోటీల నిర్వహణకు ఎటువంటి కార్యాచరణ చేపట్టకుండా నేరుగా షెడ్యూల్‌ను ప్రకటించడం గమనార్హం. వాస్తవానికి ప్రతి ఏడాది జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాలతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి పోటీల నిర్వహణకు వారి సహకారం కోరుతుంటారు. అయితే ఈ ఏడాది అటువంటి సమావేశాలు నిర్వహించకుండానే పోటీల నిర్వహణకు సిద్ధం కావడం ఎంపిక పోటీల్లో పారదర్శకతను ఎత్తి చూపేలా చేస్తోంది.

పోటీల షెడ్యూల్ ఇలా..

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మొత్తం మూడు వయస్సుల విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. అండర్-11, 14,17 విభాగాల్లో కేవలం స్కేటింగ్ క్రీడాంశంలో మాత్రమే పోటీలు నిర్వహించనున్నారు. ఈనెల 16న విజయనగరం జిల్లా కేంద్రంలో గల విజ్జి స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. పోటీల్లో అండర్-11 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2015 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన వారై ఉండాలి. అదేవిధంగా అండర్-14 విభాగంలో 2012 జనవరి 1వ తేదీ అనంతరం, అండర్-17 విభాగంలో 2009 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు.

జిల్లా స్థాయి పోటీల షెడ్యూల్ ఇదే ..

తేదీ	క్రీడాంశం	వేదిక
10-09	సెపక్‌తక్రా	జెడ్పీహెచ్‌ఎస్, అలుగోలు
10-09	టేబుల్ టెన్నిస్	పీఎస్ఆర్ స్కూల్, విజయనగరం
10-09	మాల్కంబ్	పీఎస్ఆర్ స్కూల్, విజయనగరం
11-09	ఫెన్సింగ్	విజ్జి స్టేడియం, విజయనగరం
11-09	ఫుట్‌బాల్	రాజీవ్ స్టేడియం, విజయనగరం
11-09	వెయిట్‌లిఫ్టింగ్	కోడిరామమూర్తి వ్యాయామశాల
12-09	సైక్లింగ్	విజ్జి స్టేడియం, విజయనగరం
12-09	టెన్నిస్	విజ్జి స్టేడియం విజయనగరం
12-09	కరాటే	జెడ్పీహెచ్‌ఎస్, కొత్తవలస
12-09	జూడో	జెడ్పీహెచ్‌ఎస్, అరికతోట
14-09	షూటింగ్	పీఎస్ఆర్ కాలనీ, విజయనగరం
15-09	బాక్సింగ్	రాజీవ్ స్టేడియం, విజయనగరం
15-09	రెజ్లింగ్	కొండవెలగాడ

కోర్కెలు తీర్చే కోడూరుమాత

- 13న మరియమాత యాత్ర

బాడంగి: జిల్లాలోని బాడంగి మండలం కోడూరు గ్రామంలో వెలసిన అద్భుత మరియ కోడూరు మాతను కోరినకోర్కెలు తీర్చే కల్పవల్లిగా ఉత్తరాంధ్ర ప్రజలు విశ్వసిస్తుంటారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారు మాతను దర్శించుకుంటే ఆరోగ్యం కుదుటపడి బాధలన్నీ తొలగి స్వస్థత చేకూరుతుందని భక్తులలో ప్రగాఢమైన విశ్వాసం. ఈ కారణంగా గడిచిన 25 ఏళ్లగా ప్రాచుర్యం పొందిన మరియ మాతకు ఏటా సెప్టెంబర్ రెండోశనివారం యాత్రోత్సవాన్ని నిర్వహిస్తుంటారు. కోడూరులోని డొంకాడ ఉమామహేశ్వరరావు అనే పక్షవాతరోగికి స్వప్నంలో మాత సాక్షాత్కరించి ఆయన వ్యాధిని రూపుమాపి తాను మరియ మాతనని ఫలానాచోట వేపచెట్టుపై నివాసముంటున్నానని తనకు గుడికట్టాలని చెప్పి అదృశ్యమైంది. ఈ మేరకు తొలుత గ్రామంలో ఓ చెట్టుప్రాంతంలో గుహను నిర్మించి మాత ప్రతిమను అమర్చారు. అప్పటినుంచి ప్రతి రెండోశనివారం మాతను దర్శించుకుని తమ మనసులోని కోర్కెలను చెప్పుకుని మొక్కులు, మడుపులు చెల్లించు కుంటూ వచ్చేవారు. అనంతరం కోడూరుమాతగా పేరుపొందిన మరియమాత పుణ్యక్షేత్రంలో యాత్రమహోత్సవం జరుకోవడం ఆనవాయితీగా మారింది. అప్పటినుంచి ప్రతి ఏటా సెప్టెంబర్ రెండో శనివారం యాత్రను జరుపుకుంటున్నారు. ఈ యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాక రాయిపూర్, విజయవాడ తదిర ప్రాంతాలనుంచి కూడా వేలాదిసంఖ్యలో బస్సులు, కార్లు,రైళ్లు, ఆటోలు, కాలినడకన చేరుకుంటారు. ఈ యాత్రకు ఆర్టీసీ వారు ప్రత్యేకంగా బస్సులు నడువు తారు. పోలీస్ బందోబస్తు చేపట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టడి చేస్తారు. వైద్యశాఖ ఉచితంగా ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తుంది. యాత్రలో పాల్గొన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టెంట్లు, బారికేడ్లు ఏర్పాటు చేస్తారు. పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవ.పా.యుగల్‌కుమార్ ఆధ్వర్యంలో నవదిన ప్రార్థనలు నిర్వహిస్తారు. యాత్ర రోజున పలు ప్రాంతాలనుంచి ఫాదర్లు హాజరై దివ్య బలి పూజలు చేపడతారు. అదేరోజు11వ పూజలో విశాఖఅగ్ర పీఠాధిపతి డా.ఉడుమలబాల హాజరు కానున్నట్లు ఫాదర్ యుగల్‌కుమార్ తెలిపారు.

పైడితల్లమ్మ జాతరకు సన్నాహాలు



రహదారి మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాలలో అభివృద్ధి, మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది వివిధ పనుల్లో నిమగ్నమయ్యారు. రానున్న పైడితల్లి అమ్మవారి జాతర నేపథ్యంలో ఇంజినీరింగ్ పనులు ముమ్మరం చేస్తున్నారు. ఈనెల 20వ తేదీ నాటికి నిర్దేశిత పనులు పూర్తి కావాలని కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి నిర్దేశించారు. దీంతో పనుల ప్రక్రియ ఊపందుకుంది. స్థానిక రాజారావు మేడ వద్ద బీటీ రహదారి మరమ్మతు పనులు సాగుతున్నాయి. అలాగే ప్రశాంతినగర్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాంక్రీట్ పని జరుగుతోంది. గాయత్రి నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం సాగుతోంది. మయూరి ఎత్తు బ్రిడ్జి వద్ద సీసీ బెర్మ్ పనులు చేపట్టారు. కాటవీధి వద్ద కల్వర్టు మరమ్మతులు పూర్తి చేశారు. కాళీమాత టెంపుల్ ప్రాంతంలో రింగ్ రోడ్డు పరిసరాల్లో ఉన్న డివైడర్ గ్రిల్స్‌కు రకరకాల రంగులు అద్దుతున్నారు. ఆయా పనులను డీఈ శ్రీనివాసరావు, ఏఈలు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉంటే నెల్లిమర్లలోని బూస్టర్ పంప్ హౌస్ ప్రాంతాన్ని డీఈ నరసింహారెడ్డి పరిశీలించారు. కొన్ని ప్రాంతాలలో రహదారులకు ఇరువైపులా ఉన్న లతలను సిబ్బంది తొలగించారు. గుబురుగా ఉన్న ప్రాంతాలను చదును చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పైడితల్లమ్మ జాతర నాటికి నగర సుందరీకరణలో భాగంగా అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నామన్నారు. ఈనెల 20వ తేదీలోగా పనులు పూర్తి చేసి ప్రజలు, భక్తుల కోసం నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం మరింత సమర్థవంతంగా జాతర నిర్వహించేందుకు అందరి సమన్వయంతో కృషి చేస్తున్నామన్నారు.

సతివాడ ఘటనలో 72 మందిపై కేసుల నమోదు



సతివాడలో కొనసాగుతున్న పోలీసుల పికెట్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో ఇటీవల జరిగిన గణనాథుడి ఊరేగింపులో తలెత్తిన ఉద్రిక్తత ఘటనలో ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన మొత్తం 72 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ సోమవారం తెలిపారు. ఎస్సీ కాలనీ గణేష్ నిమజ్జనం ఊరేగింపులో బీసీ సామాజిక వర్గానికి చెందిన గ్రామస్తులు తమ ఇళ్ల ముందు నుంచి వెళ్లకుండా అడ్డుకున్న సంగతి తెలిసిందే. దళితులమనే అక్కసుతోనే తమ గణేష్ ఊరేగింపును అడ్డగించారని, కులం పేరిట దూషించారని, బీసీ సామాజిక వర్గానికి చెందిన 36 మందిపై ఉత్సవ నిర్వాహకులు నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా..ఫిర్యాదులో పేర్కొన్న 36 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అదే ఘటనలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు బీసీ మహిళలపై దాడి చేశారని, అసభ్యకరంగా ప్రవర్తించారంటూ వారు కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 36 మందిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇరువర్గాల పరస్పర ఫిర్యాదులతో మొత్తం 72 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని ఎస్సై గణేష్ స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా పోలీస్ పికెట్ గ్రామంలో కొనసాగిస్తున్నామన్నారు.

గడువు దాటక ముందే పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- పీజీఆర్ఎస్‌కు 167 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం అర్బన్:

ప్రజావినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్‌లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని ఇంకనూ చూడవలసిన కాలమ్‌లో ఎప్పుడు చూసినా సున్నా కనపడాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రతిరోజూ లాగిన్ అయిన అధికారులు వినతులను చూడాలని అలాగే రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ చేసి ముగించాలని తెలిపారు. గడువులోగా వినతులకు సమాధానాలు పంపాలని లేని ఎడల సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్‌తో పాటు సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, ప్రమీలా గాంధీ, మురళి ప్రజల నుంచి వినతులు 167 వినతులు స్వీకరించారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 20 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 20 ఫిర్యాదులు వచ్చాయి. కార్యాలయానికి ఫిర్యాదుతో వచ్చిన ప్రతి బాధితుడి ఆవేదనను ఎస్పీ వకుల్ జిందల్ అడిగి తెలుసుకున్నారు. వారి ముందే సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఎస్పీ ఫోన్ చేసి వివరాలు కనుక్కున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్పీ సీఐ ఏవీలీలారావు, డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల స్వగ్రామాల్లో విషాదఛాయలు



సూర్యప్రకాష్ (ఫైల్)

జామి: మండలంలోని అలమండ గ్రామం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శిరికిపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బోని సాగర్, గుల్లిపల్లి సురేష్ అక్కడికక్కడే మృతిచెందారు. భీమాళి గ్రామానికి చెందిన మిడతాన సూర్యప్రకాష్ విజయనగరం ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన గణేష్, సత్యవతి దంపతుల కుమారుడు సూర్యప్రకాష్ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. పోస్ట్ మార్టం నిర్వహించి మృతదేహాలను వారి స్వగ్రామాలకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ముగ్గురు యువకులు, చేతికి అందివచ్చిన తరుణంలో మృత్యువాత పడడంతో మృతుల గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వ్యక్తిపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన కంత రామలక్ష్మిని అదే గ్రామానికి చెందిన టొంపల రాజు మానసికంగా వేధిస్తున్నాడని బాధితురాలు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రామలక్ష్మి భర్త జీవనోపాధి నిమిత్తం విజయవాడ తరచూ వెళ్తుంటాడు. భర్త లేని సమయంలో రాజు ఆమెను మానసికంగా వేధిస్తుండగా భర్త ఇంటికి రావడంతో ఆమె ఈ విషయం తెలపడంతో సోమవారం స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

దాడికారణంగానే వాచ్‌మన్ మృతి



దాడికి పాల్పడిన నిందితులను హాజరుపరిచి వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేంద్ర

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన వాచ్‌మన్ కోడూరు ముత్యాలనాయుడిపై లారీ డ్రైవర్లు చేసిన దాడి కారణంగానే మృతిచెందాడని రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ముత్యాలనాయుడు మృతికి కారకులైన ఇద్దరు లారీ డ్రైవర్లను అరెస్టుచేశామని తెలిపారు. స్థానిక పాలకొండ రోడ్డులోని లక్ష్మీ నారాయణ రైస్‌మిల్లు వద్ద ముత్యాలునాయుడు వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత నెల 14 మిల్లు వద్దకు లారీ డ్రైవర్లు విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం చిర్లపాలెం గ్రామానికి చెందిన బూర్లె నాగరాజు, కోరాడ చిన్నప్పడులు రెండు లారీల ఊక ఎత్తుకునేందుకు వచ్చారు. ఈ క్రమంలో అక్కడ మద్యం తాగుతుండగా వారించిన వాచ్‌మన్‌పై విచక్షణా రహితంగా డ్రైవర్లు దాడిచేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడడంతో వాచ్‌మన్ తొడ ఎముక విరిగిపోయిందని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదుచేసి ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని చెప్పారు. కార్యక్రమంలో సంతకవిటి ఎస్సై ఆర్.గోపాలరావు, సిబ్బంది ఉన్నారు.

వినతులకు పరిష్కారం చూపండి

- కలెక్టరేట్ ఎ.శ్యామ్‌ప్రసాద్



అర్జీదారుల నుంచి వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ



ఫిర్యాదు దారుల సమస్యలను వింటున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి



డీఈఓపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురం రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన రీతిలో పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 133 వినతులు స్వీకరించారు. వినతుల స్వీకరణలో కలెక్టర్‌తోపాటు డీఆర్‌ఓ హేమలత, ఉప కలెక్టర్ పి. ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం. సుధారాణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వినతులను సంబంధిత అధికారులే స్వయంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసిన అనంతరం పరిష్కారం చూపాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి పలు సమస్యలపై వచ్చిన ప్రజలు అర్జీలను అందజేశారు.

డీఈఓపై చర్యలు తీసుకోవాలి

గిరిజన విద్యార్థులు, ఉపాధ్యాయులపై వివక్ష చూపుతున్న జిల్లా విద్యాశాఖాధికారిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం, ఆదివాసీ హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో పి.రంజిత్ కుమార్, పల్లా సురేష్, ఆరిక చంద్రశేఖర్, మరికొంతమంది నాయకులు నిరసన తెలుపుతూ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పదోతరగతి ప్రతిభా అవార్డులలో గిరిజన విద్యార్థులను కానీ, ఉపాధ్యాయ దినోత్సవంలో గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కానీ, కేటాయింపు చేయకుండా వివక్షతో డీఈఓ వ్యవహరిస్తున్నారని, ఈ మేరకు ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిర్దేశించిన సమయంలో ఫిర్యాదుల పరిష్కారం

ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులు నిర్దేశించిన సమయంలోనే చట్టపరిధిలో పరిష్కరించాలని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత స్టేషన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించు కోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ ఫోన్‌లో స్వయంగా మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 12 ఫిర్యాదులు అందాయి. డీసీఆర్బీ సీఐ ఆదాం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 41 వినతులు

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 41 వినతులు వచ్చాయి. ఎరువులు ఇప్పించాలని పాలిష్‌కోట రైతులు అర్జీ ఇచ్చారు. సీసీ రోడ్డు పూర్తి చేయాలని మూర్తిగాడి గూడకు చెందిన సవర రవికుమార్ కోరారు. కొండపోడు పట్టా ఇప్పించాలని శుబలయకు చెందిన పాట్నూరు గౌరికుమారి విన్నవించారు. పెద్దగూడకు చెందిన సవర ఆదమ్మ మోటార్ ఇంజిన్‌కు రుణం ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. కొత్తగూడలో సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు వినతిఇచ్చారు. లాడలో సెల్ టవర్ పెట్టాలని ఆరిక ప్రసాద్ కోరారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, డిప్యూటీఈఓ రామ్మోహన్‌రావు, పీహెచ్‌వో ఎస్వీ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో కళా ఉత్సవ్ పోటీలు

నెల్లిమర్ల:

స్థానిక వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈ నెల 11, 12వ తేదీల్లో భారతీయ సంస్కృతీ సంప్రదాయ వారసత్వ కళల పోటీలు(కళా ఉత్సవ్) నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు సోమవారం తెలిపారు. 'ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్-2047లో భారతదేశం' అనే అంశం థీమ్‌తో పోటీలు ఉంటాయన్నారు. ప్రభుత్వ గుర్తింపు కలిగిన విద్యాసంస్థల్లో 9, 10, 11, 12 తరగతులకు చెందిన ఆసక్తి ఉన్న విద్యార్థులంతా ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. కళా ఉత్సవ్ ఇన్‌చార్జ్ వాక చిన్నంనాయుడు మాట్లాడుతూ 11న గాత్ర సంగీతం వ్యక్తిగత-బృందం, వాయిద్య సంగీతం వ్యక్తిగత-బృందం, నృత్యం వ్యక్తిగత-బృందం విభాగాల్లో నిర్వహిస్తామని, 12న థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్, సంప్రదాయ కథాకథనం విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల కోసం రిజిస్ట్రేషన్‌ను 10వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ఫోన్ నంబర్ 9440912863ను సంప్రదించి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, అధ్యాపకులు రమేష్, సూరిబాబు, తిరుపతిరావు, అప్పారావు, అన్నారావు, శ్రీనివాసరావు, శర్మ, సోమయాజులు, సూర్యకళ, రజిత, సౌమ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.